ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం


Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

సోమవారం | 26-10- 2026 | సంపుటి: 17, సంచిక: 205, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



మూసీనది బఫర్ జోన్‌లో

కబ్జాల జోరు

- అంబర్‌పేట్ పరివాహక ప్రాంతంలో రెచ్చిపోతున్న భూబకాసురులు!
- రౌడీల మోహరింపు జేసీబీలతో చదును
- కబ్జా కోరల్లో మూసి
- గతంలో రిటర్నింగ్ వాల్ నిర్మాణం కూల్చివేసిన ఎమ్మార్వో....
- ఉలుకు పలుకులేని ఇరిగేషన్ శాఖ అధికారులు...
- ఫిర్యాదులు చేసినా చర్యలకు పూనుకోని రెవెన్యూ అధికారులు



హైదరాబాద్ అక్టోబర్ 25(ప్రజాకలం ప్రతినిధి)

ఓ పక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీనది సుందరీకరణ పనులు, పునరుజ్జీవన ప్రాజెక్టును వేగవంతం చేస్తుంటే, మరోపక్క అంబర్‌పేట్ మూసీ పరివాహక ప్రాంతంలో కబ్జారాయుళ్లు బరితెగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, కళ్లెదుటే నది బఫర్ జోన్‌ను కబ్జా చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

రౌడీల మోహరింపు.. జేసీబీలతో చదును!

అంబర్‌పేట్ నియోజకవర్గ పరిధిలోని మూసీ నది బఫర్ జోన్ ప్రస్తుతం కబ్జాకోరల్లో చిక్కుకుంది. కబ్జారాయుళ్లు ఏకంగా రౌడీ మూకలను, గూండాలను రంగంలోకి దించి ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. సామాన్యులు అటువైపు వెళ్లకుండా బెదిరింపులకు దిగుతూ, ఇటాచీలు, జేసీబీలు పెట్టి రాత్రికి రాత్రే నది పరివాహక ప్రాంతాన్ని చదును చేసేస్తున్నారు.నది ప్రవాహాన్ని సైతం అడ్డుకునేలా మట్టి, శిథిలాలను కుమ్మరిస్తూ భూమిని ఆక్రమిస్తున్నారు.

అధికారుల ఉదాసీనత..

గతంలో ఇదే ప్రాంతంలో కబ్జారాయుల్లు అక్రమంగా నిర్మించిన రిటర్నింగ్ వాల్ నిర్మాణాన్ని ఇప్పుడున్న తాసిల్దార్ కూల్చివేశారు. కానీ కబ్జాలకు పాల్పడ్డ వ్యక్తులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడంతో మళ్లీ రెచ్చిపోయి ఏదేర్చగా కబ్జాలకు పాల్పడుతున్నారు.

ప్రస్తుతం ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు మూర్తిగా ఉలుకూ పలుకూ లేకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇరిగేషన్ శాఖ మౌనం:

నది పరిరక్షణ చూడాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు కళ్లముందే ఇంత జరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం:

స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు ఫిర్యాదులు చేసినా,రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలకు పూనుకోవడం లేదు.అధికారుల ఈ మౌనం కబ్జారాయుళ్లకు మరింత తోడవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ప్రభుత్వ ఆశయాలకు గండి..

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మూసీ నదిని లండన్ లోని థేమ్స్ నదిలా మారుస్తామని, ఆక్రమణలను ఉపేక్షించబోమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.కానీ క్షేత్రస్థాయిలో అంబర్‌పేట్ బఫర్ జోన్‌లో జరుగుతున్న ఈ కబ్జాల పర్వం ప్రభుత్వ ఆశయాలకే గండి కొట్టేలా ఉంది. ఇప్పటికైనా రెవెన్యూ,ఇరిగేషన్ ఉన్నతాధికారులు, హైడ్రా బృందాలు తక్షణమే స్పందించి, అంబర్‌పేట్ మూసీ పరివాహక ప్రాంతంలో జరుగుతున్న అక్రమంగా చేస్తున్న కబ్జాను అడ్డుకోవాలని, కబ్జారాయుళ్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



'మన్ కీ బాత్' యువతకు స్ఫూర్తి

శేరిలింగంపల్లిలో ప్రధాని కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

హైదరాబాద్ అక్టోబర్ 25(ప్రజాకలం ప్రతినిధి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్‌ను బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు స్థానికులతో కలిసి వీక్షించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్‌లోని లక్ష్మీస్ ఎంపీరియా అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జి రేఖాశర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్ యాదవ్ తదితర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యమివ్వాలి

కార్యక్రమం అనంతరం రాంచందర్‌రావు మాట్లాడుతూ.. 'మన్ కీ బాత్' ద్వారా విద్యార్థులు, యువతతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రధాని మోదీ స్ఫూర్తి, దిశానిర్దేశం చేస్తున్నారని అన్నారు. దీపావళి, ఛత్ పండుగల నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రధాని ఇచ్చిన పిలుపును స్వాగతించారు.

'వోకల్ ఫర్ లోకల్' స్ఫూర్తితో దేశీయ ఉత్పత్తులు అంతర్జాతీయ గుర్తింపు పొందుతున్నాయని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో హేవల్ నది పునరుజ్జీవనం, పంజాబ్‌లో సేంద్రీయ పత్తి సాగు, మహారాష్ట్ర గిరిజన ఉత్పత్తుల ప్యాకేజింగ్‌కు జపాన్ 'గుడ్ డిజైన్ అవార్డు' లభించడం, బిహార్ మఖానా, కర్ణాటక కందిపప్పు విదేశాలకు ఎగుమతి కావడం వంటి అంశాలు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

జవహర్‌నగర్ చెత్త సమస్యకు

శాశ్వత పరిష్కారం చూపాలి

- పాలకులకు వ్యక్తిగత కక్షలు ఉండకూడదు.. ఈటల రాజేందర్

27 నుంచి బాధితులతో పాదయాత్ర.. ఒక్క కిలో చెత్త కూడా తరలించొద్దని డిమాండ్



హైదరాబాద్ అక్టోబర్ 25(ప్రజాకలం ప్రతినిధి)

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు కాలుష్య నియంత్రణ, పరిసర ప్రాంతాల ప్రజల సమస్యలపై సోమవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మేధావులు, పర్యావరణవేత్తలు, బాధితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ పరిసరాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డంపింగ్ యార్డు కారణంగా సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో కాలుష్య సమస్య ఉందని పేర్కొన్నారు. మహిళలకు ఆరోగ్య సమస్యలు, పిల్లలకు చర్మ సంబంధిత ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

కోర్టు తీర్పులూ అమలు కావడం లేదు

డంపింగ్ యార్డు నిర్వహణలో రాంకీ సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ఈటల విమర్శలు చేశారు. డబ్బు, పలుకుబడితో కోర్టుల తీర్పులు కూడా అమలు కాకుండా పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. పాలకులే చట్టాలను గౌరవించకపోతే ప్రజలకు చట్టాలపై నమ్మకం ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

జవహర్‌నగర్‌లో ఓ బాలుడిని కుక్కలు పీక్కుతిన్న ఘటన తర్వాతే సమస్య తీవ్రత తన దృష్టికి వచ్చిందని తెలిపారు. రాంకీ సంస్థకు సంబంధించిన సీఎస్ఆర్ నిధులను స్థానిక ప్రజల తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేయాలని కోరారు.

'జీరో పొల్యూషన్' సాంకేతికతతో ప్లాంట్లు

ఇకపై మరో ప్రాంతానికి చెత్త తరలించేందుకు ప్రజలు అంగీకరించే పరిస్థితి లేదని ఈటల అన్నారు.

తరువాయి 2వ పేజీలో...



జవహర్‌నగర్ డంపింగ్ యార్డును

తక్షణమే తొలగించాలి

- ఈటల రాజేందర్ పాదయాత్రకు అఖిలపక్ష ప్రజా సంఘాల మద్దతు
- పేద, అణగారిన వర్గాల ఆరోగ్యాన్ని కాపాడే వరకు పోరాటం
: తిప్పారపు లక్ష్మణ్ మాదిగ

హైదరాబాద్ అక్టోబర్ 25(ప్రజాకలం ప్రతినిధి)

కాప్రా మండల పరిధిలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ పర్యావరణ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ టూరిజం హోటల్‌లో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్రకు సమావేశం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. డంపింగ్ యార్డు తొలగింపు కోసం చేపట్టే ఉద్యమంలో భాగస్వాములవుతామని ప్రజా సంఘాల నాయకులు వెల్లడించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఈటల రాజేందర్ హాజరుకాగా.. విశిష్ట అతిథిగా ఎంఆర్‌పీఎస్--ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

ఈ సందర్భంగా తిప్పారపు లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేదలేనని తెలిపారు. పేదలు, అణగారిన వర్గాలు ఎక్కువగా నివసించే ప్రాంతం కావడంతోనే సమస్యను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన ప్రజల్లో నెలకొందన్నారు. డంపింగ్ యార్డు కారణంగా దుర్వాసన, దోమలు, ఈగలు, వాయు కాలుష్యం, భూగర్భ జలాల కలుషితం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

తరువాయి 2వ పేజీలో...

దిగొచ్చిన పసిడి ధరలు

దీపావళికి ముందే స్వల్ప తగ్గుదల..

వెండి ధర కిలో రూ.2.19 లక్షలు



హైదరాబాద్ అక్టోబర్ 25(ప్రజాకలం ప్రతినిధి)

దీపావళి, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ బంగారం కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. సోమవారం పసిడి ధరలు స్వల్పంగా తగ్గాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,42,570గా, 22 క్యారెట్ల ధర రూ. 1,30,690గా నమోదైనట్లు మార్కెట్ ధరల సమాచారం.

విజయవాడ, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, ముంబయిలోనూ ఇదే స్థాయిలో ధరలు ఉన్నట్లు సమాచారం. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,42,720, 22 క్యారెట్ల ధర రూ. 1,30,840గా ఉంది.

వెండి రూ. 2. 19 లక్షలు

హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, చెన్నై, బెంగళూరులో కిలో వెండి ధర రూ. 2,19,900గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ విలువ, వడ్డీ రేట్ల అంచనాలు పసిడి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. నగలు కొనుగోలు చేసేవారు హాల్‌మార్క్, మేకింగ్ ఛార్జీలు, జీఎస్‌టీ వంటి అదనపు వ్యయాలను పరిశీలించాలని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి.

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రులు పొన్నం, అడ్లూరి

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 25 (ప్రజా కలం)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఆలయ అర్చకులు, అధికారులు వారికి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.





జవహర్‌నగర్ చెత్త సమస్యకు

శాశ్వత పరిష్కారం చూపాలి

మొదటి పేజీ తరువాయి...

జీరో పొల్యూషన్ సాంకేతికతతో ఆధునిక వ్యర్థ నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. చెత్తను రీసైకిల్ చేయడంతో పాటు విద్యుత్, బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించవచ్చని చెప్పారు.

దేశ రాజధాని ఢిల్లీలో భారీ మొత్తంలో చెత్తను రీసైకిల్ చేస్తున్నారని, అలాంటి ఆధునిక విధానాలను జవహర్‌నగర్‌లోనూ అమలు చేయాలని కోరారు.

‘నాలుగు నెలలైనా సమస్య పరిష్కారం కాలేదు’

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తాను తొలిసారి కలిసింది జవహర్‌నగర్ ప్రజల సమస్య కోసమేనని ఈటల తెలిపారు. సమస్య పరిష్కారానికి సమావేశం నిర్వహించాలని కోరగా.. ‘మీరే సమావేశం పెట్టండి’ అని సూచించారని చెప్పారు. అయితే నాలుగు నెలలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు.

చెత్త ఏరుకునే కార్మికులు కూడా తమ వద్దకు వచ్చారని, వారికి ఉపాధి లేకుండా చేసే చర్యలు వద్దని కోరారు. సంస్థలు లాభాలు ఆర్జించడాన్ని తప్పుపట్టడం లేదని, ప్రజల ఇబ్బందులకు కారణమయ్యే విధంగా వ్యవహరించరాదని అన్నారు.

27 నుంచి పాదయాత్ర

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం ఈ నెల 27 నుంచి పాదయాత్ర చేపడుతున్నట్లు ఈటల ప్రకటించారు. బాధిత కుటుంబాల నుంచి ఒక్కొక్కరు పాదయాత్రలో పాల్గొంటారని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి అవసరమైన నిధులు తీసుకొచ్చే బాధ్యతను తామే తీసుకుంటామని చెప్పారు.

జవహర్‌నగర్‌లో ప్రస్తుతం ఉన్న చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో రీసైకిల్ చేయాలని, ఇకపై ఒక్క కిలో చెత్త కూడా అక్కడికి రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలి’

జవహర్‌నగర్ సమస్యపై ప్రభుత్వం రాజకీయాలు చేయవద్దని ఈటల కోరారు. కాళేశ్వరం అంశాన్ని ప్రస్తావిస్తూ.. గత ప్రభుత్వంపై కేసుల పేరుతో రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. “పాలకులకు వ్యక్తిగత కక్షలు ఉండకూడదు. గొప్ప పదవిలో ఉండటం కంటే ఆ పదవికి ఎంత న్యాయం చేస్తున్నామన్నదే ముఖ్యం. రేవంత్‌రెడ్డి.. కాలగర్భంలో కలిసిపోతారా? ప్రజలకు గుర్తుండిపోయేలా ఉంటారా? అనేది నిర్ణయించుకోవాలి. జవహర్‌నగర్ సమస్య పరిష్కారం చేయడం ప్రభుత్వం చేయగలిగిన పని” అని ఈటల వ్యాఖ్యానించారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డును

తక్షణమే తొలగించాలి



మొదటి పేజీ తరువాయి...

చిన్నారులు, వృద్ధులు, మహిళలు, కార్మిక కుటుంబాలు కాలుష్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించి, కాలుష్య నియంత్రణకు శాస్త్రీయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సమగ్ర కార్యాచరణ ప్రకటించాలి

చెత్త నిర్వహణ పేరుతో ఒక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతినకూడదని లక్ష్మణ్ మాదిగ అన్నారు. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందాల్సిన సమయంలో పేద, అణగారిన వర్గాలు కాలుష్య భారాన్ని మోయడం అన్యాయమన్నారు.

ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల భద్రతను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డు తొలగింపునకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

డంపింగ్ యార్డు తొలగించే వరకు, ప్రభావిత ప్రజలకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని లక్ష్మణ్ మాదిగ స్పష్టం చేశారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో, ఆయన సూచనల మేరకు ప్రజా ఉద్యమంలో ముందుంటామని తెలిపారు.

ఈ నెల 27న ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్రకు మద్దతుగా నిలిచి, జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

ప్రజా సంఘాల నేతల హాజరు

సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు కేశపాక రామచంద్ర మాదిగ, టీవీ నరసింహారావు మాదిగ, ఇటుక శ్రీకృష్ణ మాదిగ, కొండ్రపల్లి శివ మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాల నిర్వహణకు సన్నాహక సమావేశం



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్తీక వనభోజనాల ఏర్పాట్లపై సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ అధ్యక్షతన ఆదివారం సూరారం కాలనీలోని ఆర్యవైశ్య భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈసమావేశంలో పరాభవ నామ సంవత్సర కార్తీక శుద్ధ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 22వ తేదీ ఆదివారం రోజున కార్తీక వనభోజనాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, సభ్యుల భాగస్వామ్యం, కార్యక్రమ నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

సంఘ సభ్యులందరూ సమన్వయంతో వనిచేస్తూ కార్తీక వనభోజనాలను విజయవంతం చేయాలని అధ్యక్షుడు కోరారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సంఘ సభ్యుల మధ్య ఐకమత్యాన్ని పెంపొందించడంతో పాటు సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈసమావేశంలో సంఘం ప్రధాన సలహాదారు సర్వేపల్లి రమేష్ కుమార్, సలహాదారు పరుశురామ శర్మ, కార్యవర్గ సభ్యులు గడ్డం రాంబాబు, కోడూరి జగదీష్, శ్రీధరాచార్యులు, ప్రభాకర్ శర్మ, మాలతి శ్రీనివాస్, నుబ్బలక్ష్మి సంజీవరావు, రమేష్ కులకర్ణి, సాయి సుందరి, రత్నమాల సుబ్బారావు, సుబ్రహ్మణ్య స్వామి, గోవర్ధన్ రావు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

రావిరాలలో రైతుల భూమిని ఆక్రమిస్తున్న “అర్బన్ క్రైస్ట్” వెంచర్

75 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని కబ్జా చేస్తున్నారని రైతుల ఆవేదన

కబ్జా చేసిన వారికే భద్రత కల్పిస్తున్న పోలీసులు

మాకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు - బాధిత రైతులు

మహేశ్వరం, అక్టోబర్ 25 (ప్రజా కలం):

మహేశ్వరం మండల పరిధిలోని రావిరాల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 54, 55, 56 లలో ఉన్న తమ పూర్వీకుల భూమిని “అర్బన్ క్రైస్ట్” వెంచర్ యాజమాన్యం అక్రమంగా ఆక్రమించి వెంచర్ చేస్తుందని రావిరాల గ్రామానికి చెందిన తుళ్ల జంగయ్య వారసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సుమారు 75 సంవత్సరాలుగా తుళ్ల జంగయ్య కుటుంబం ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇటీవల కుటుంబ సభ్యుల అనారోగ్యం కారణంగా కొన్ని రోజులుగా భూమిని సాగు చేయకుండా వదిలేశారు. దీనినే అదునుగా చేసుకున్న అర్బన్ క్రైస్ట్ వెంచర్ యాజమాన్యం, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, తమ పొలాల్లోకి చొచ్చుకు వచ్చి వెంచర్ లేఅవుట్ వేసి ప్లాట్లుగా మారుస్తుందని బాధితులు ఆరోపిస్తున్నారు. తమ భూమిని కాపాడాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని, పైగా అదే వెంచర్ యాజమాన్యం ఫిర్యాదు చేస్తే మాత్రం వెంటనే స్పందించి రైతులను అక్కడి నుంచి తరిమేయాలని చూస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులే కబ్జాదారులకు కొమ్ముకాస్తూ, తమను బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు.ఎవరు ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ పూర్వీకుల భూమి తమకు దక్కే వరకు చట్టపరమైన పోరాటం ఆగదని తేల్చి చెప్పారు.ఈ నేపథ్యంలో అర్బన్ క్రైస్ట్ వెంచర్ లో ప్లాట్లు కొనుగోలు చేయాలనుకునే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వివాదాస్పద భూముల్లో ప్లాట్లు కొని మోసపోవద్దని, రిజిస్ట్రేషన్లకు ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని బాధిత రైతులు హెచ్చరించారు. లేని పక్షంలో భవిష్యత్తులో తీవ్రమైన న్యాయపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



‘మన్ కీ బాత్’ స్ఫూర్తిదాయకం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 25 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న ‘మన్ కీ బాత్’ కార్యక్రమం సమాజంలోని అన్ని వర్గాలకు స్ఫూర్తినిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే ‘మన్ కీ బాత్’ 139వ ఎపిసోడ్‌ను ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో వర్చువల్‌గా వీక్షించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, నదుల ప్రక్షాళన, స్వచ్ఛత, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రధాని మోదీ కార్యక్రమంలో ప్రస్తావించిన విషయాలు ప్రజల్లో అవగాహన పెంచేలా ఉన్నాయని పేర్కొన్నారు.

సమాజహితానికి ఉపయోగపడే అంశాలను ప్రజల ముందుకు



తీసుకురావడం ‘మన్ కీ బాత్’ ప్రత్యేకత అని అన్నారు. దేశ నాయకుడిగా ప్రధాని మోదీకి ఉన్న పరిపక్వత, ప్రజలతో ఆయనకున్న అనుసంధానానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోందని కీర్తిరెడ్డి పేర్కొన్నారు.

‘మన్ కీ బాత్’ యువతకు స్ఫూర్తి

శేరిలింగంపల్లిలో ప్రధాని కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

మొదటి పేజీ తరువాయి...

పట్టభద్రుల ఓటరు నమోదుపై పిలుపు

తెలంగాణలో త్వరలో జరగనున్న మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై రాంచందర్‌రావు ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 2023 అక్టోబరు 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఫారం--18 ద్వారా నవంబరు 6లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. గతంలో ఓటు హక్కు ఉన్నవారు సైతం తాజా ఓటరు జాబితాలో నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

నవంబరు 1న బీజేపీ మహాపాదయాత్ర

అనంతరం బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జి రేఖాశర్మ మాట్లాడుతూ.. కుల, మతాల పేరుతో దేశాన్ని, సమాజాన్ని విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీనపరిచే చర్యలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని అన్నారు.

రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ ఆధ్వర్యంలో నవంబరు 1న తెలంగాణలో ‘లోక్‌తంత్ర బచావో--భీడ్‌తంత్ర హఠావో’ పేరుతో మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణను ప్రజాస్వామ్య వ్యతిరేక, మూకతత్వ రాజకీయాల నుంచి కాపాడేందుకు ప్రజలు, మేధావులు ఉద్యమానికి మద్దతుగా తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.

రూ.600కే వారం రోజుల అపరిమిత బస్ ప్రయాణం

హైదరాబాద్ ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ ‘ధమాకా’ ఆఫర్

ఏసీ బస్సులతో సహా అన్ని సిటీ బస్సుల్లో ప్రయాణం

పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్‌కు మాత్రం వర్తించదు

హైదరాబాద్, అక్టోబర్ 25 (ప్రజా కలం ప్రతినిధి)

హైదరాబాద్ నగరంలో నిత్యం ప్రయాణించే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) శుభవార్త చెప్పింది. ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, సులభతరమైన ప్రజా రవాణా అందించేందుకు రూ.600 ధరతో ‘వీక్లీ బస్ పాస్’ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పాస్ కొనుగోలు చేసిన రోజు నుంచి వరుసగా ఏడు రోజుల పాటు ఇది చెల్లుబాటు అవుతుంది.

ఏసీ బస్సుల్లోనూ అపరిమిత ప్రయాణం

కొత్త వీక్లీ బస్ పాస్‌తో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని రకాల సిటీ బస్సుల్లో అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఏసీ బస్సులకూ ఈ సౌకర్యం వర్తిస్తుంది. అయితే ‘పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్’ సర్వీసులకు ఈ పాస్ వర్తించదని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. ఇప్పటికే అందుబాటులో ఉన్న రోజువారీ, నెలవారీ బస్ పాస్‌లకు అదనంగా ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఈ వారపు పాస్‌ను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా నగరంలో వారం రోజుల పాటు ఉండే పర్యాటకులు, వ్యాపార పనులపై వచ్చే వారు, నిరంతరం సిటీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఇది ఉపయోగకరంగా ఉంటుందని సంస్థ తెలిపింది.

టికెట్ల కోసం మళ్లీ మళ్లీ క్యూలు వద్దు

వీక్లీ పాస్ తీసుకున్న ప్రయాణికులు ఏడు రోజుల వ్యవధిలో ప్రతి ప్రయాణానికీ ప్రత్యేకంగా టికెట్ కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. ఒక్కసారి పాస్ తీసుకుంటే చెల్లుబాటు వ్యవధిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సిటీ బస్సుల్లో అపరిమితంగా ప్రయాణించే అవకాశం ఉంటుంది.

అన్ని బస్ పాస్ కౌంటర్లలో లభ్యం

వీక్లీ బస్ పాస్‌లు నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. ప్రయాణికులు తమకు సమీపంలోని బస్ పాస్ కౌంటర్‌లో పాస్ కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొంది.

ప్రజా రవాణాకు ప్రోత్సాహం

ప్రజా రవాణా వ్యవస్థ వినియోగాన్ని మరింత ప్రోత్సహించడంతో పాటు, నగర ప్రయాణికులకు అందుబాటు ధరలో మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీజీఎస్ఆర్టీసీ వీసీ, ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో వారం రోజుల పాటు ప్రయాణించే వారు రూ.600 వీక్లీ బస్ పాస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.



ఉక్రెయిన్ నుంచి మృతదేహం

రవాణాకు ప్రభుత్వం చొరవ

- ఫలించిన ఎమ్మెల్యే, మంత్రి ప్రత్యేక కృషి

-భూమార్గంలో ఉక్రెయిన్ నుంచి పోలాండ్‌కు

-ఈనెల 31న స్వగ్రామం చేరనున్న శవపేటిక

జగిత్యాల ప్రతినిధి

అక్టోబర్ 25 (ప్రజా కలం)

జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ మృతదేహాన్ని ఉక్రెయిన్ నుంచి స్వదేశానికి తీసుకురావడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకున్నది. ‘సీఎం ప్రవాసీ ప్రజావాణి’ బృందం, ప్రభుత్వ ఉన్నతాధికారులు, భారత రాయబార కార్యాలయం సమన్వయంతో మృతదేహం తరలింపునకు చర్యలు చేపట్టారు.ఉక్రెయిన్‌లో కాంక్రీట్ కార్మికుడిగా పనిచేస్తున్న సుదర్శన్ సెప్టెంబర్ 1న రష్యా క్షిపణి దాడిలో మరణించారు. దాదాపు రెండు నెలల అనంతరం ఆయన మృతదేహం స్వదేశానికి చేరుకోనున్నది. క్షిపణి దాడి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్న నేపథ్యంలో మృతదేహాన్ని తరలించేందుకు అనుమతి లభించడంలో జాప్యం జరిగినట్లు తెలుస్తున్నది. ఉక్రెయిన్ నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని మృతుడి భార్య భార్గవి ఇటీవల హైదరాబాద్‌లోని ‘సీఎం ప్రవాసీ ప్రజావాణి’లో విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో... ఈమేరకు ప్రభుత్వం వేగంగా స్పందించిందని తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి తెలిపారు.జగిత్యాల ఎమ్మెల్యే డా. మాకునూరి సంజయ్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక విజ్ఞప్తుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై చొరవ తీసుకున్నది. మృతదేహం తరలింపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఉక్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని కోరింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ--పొలిటికల్) ముఖ్య కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అహ్మద్ నదీం ఈనెల 24న ఉక్రెయిన్‌లోని భారత రాయబారి అంజనీ కుమార్‌కు అత్యవసర సందేశం పంపారు.

భూమార్గంలో ఉక్రెయిన్ నుంచి పోలాండ్‌కు..

ఉక్రెయిన్ గగనతలంలో విమానాల రాకపోకలపై ఆంక్షలు ఉన్నందున, మృతదేహం ఉన్న శవపేటికను ఉక్రెయిన్ నుంచి పోలాండ్‌కు రోడ్డు మార్గంలో తరలించనున్నారు. అనంతరం కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ విమానం ద్వారా పోలాండ్‌లోని వార్సా నుంచి నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. విమాన ప్రయాణం ఈనెల 29న ప్రారంభం కానుండగా, మృతదేహం అక్టోబర్ 31 తెల్లవారుజామున హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నట్లు సమాచారం. అక్కడి నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.

